క్లుప్తంగా

కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేత



కేటీఆర్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న గ్రామస్తులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి గ్రామంలో ఏప్రిల్ నెల 2న జరిగే ఎల్లమ్మ సిద్ధోగ వేడుకలకు రావాలని మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ మేరకు గ్రామ గౌడ సంఘం పెద్దలు కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందించారు. నాయకులు గసప మధన్ రెడ్డి, బుస్స లింగం తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న రామన్నపల్లి గ్రామస్తులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రైల్వేలైన్ పనులతో పంటపొలాలకు వచ్చే కాలువలను పూడ్చివేస్తున్నారని రామన్నపల్లె రైతులు తహసీల్దార్‌కు మొరపెట్టుకున్నారు. మంగళవారం రైతులు, గ్రామస్తులు తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువు నుంచి పిల్లిగుట్ట వరకు మూడున్నర కిలోమీటర్ల పొడవుతో కాలువ దానిపై మూడు కల్వర్టులు ఉన్నాయని, ఆ కాలువ ద్వారా సాగునీరందుతుందన్నారు. రైల్వే అధికారులు సీహెచ్102 పాయింట్ వద్ద కాలువను పూడ్చివేశారని వాపోయారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. మాజీ సర్పంచ్ ఆత్మకూరి రంగయ్య, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఆలయ నిర్మాణానికి భూమిపూజ

రుద్రంగి: మండలకేంద్రంలో బుధవారం నూతనంగా రామాలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఉంటుందని, ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపా రాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య హాజరుకానున్నట్లు వారు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు పల్లి గంగాధర్, కొమిరె శంకర్, బోయిని చెంద్రయ్య, కూర్మాచెలం సత్య నారాయణ, పరందాము, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు తొలగించాలి

ముస్తాబాద్: రాజకీయ పార్టీల పోస్టర్లు, వాల్‌రైటింగ్‌లను తొలగించాలని ఎంపీడీవో భాస్కర శర్మ ఆదేశించారు. మండలంలోని కొండాపూర్, నామాపూర్, గూడెం, ఆవునూర్ గ్రామాల్లో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. ప్రధాన కూడళ్లు, గోడలపై ఉన్న పోస్టర్లను, వాల్ రైటింగ్‌లను తొలగించాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. వాల్‌రైటింగ్, పోస్టర్ల తొలగింపులో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహించవద్దన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

గంభీరావుపేట: మండలకేంద్రానికి చెందిన ఎండీ అహ్మద్‌పాషా కొద్దిరోజుల క్రితం తన ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై రామ్మోహన్ సీఐఆర్‌ఎఫ్ యాప్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్‌ను గుర్తించారు. మంగళవారం అహ్మద్‌పాషాకు సెల్‌ఫోన్ అందించారు.

కార్యవర్గం ఎన్నిక



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ మల్లికార్జునస్వామి గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మానుక కిషన్, ఉపాధ్యక్షుడిగా లంబ బాలకిషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఉచిత ఇసుక హర్షణీయం

ముస్తాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని జెడ్పీటీసీ గుండం నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడమే కాకుండా పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా ఇసుక అందజేస్తున్నారన్నారు. సమావేశంలో ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, వెల్ముల రాంరెడ్డి, వుచ్చిడి బాల్‌రెడ్డి, రంజాన్ నరేశ్, తలారి నర్సింలు, కొంరయ్య, శీల ప్రశాంత్, కొండల్‌రెడ్డి, కొప్పు రమేశ్, సద్ది మధు, అంజనేయులు తదితరులున్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలి

- అదనపు కలెక్టర్ పూజారి గౌతమి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

సిరిసిల్ల: లోక్ సభ ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని సిరిసిల్ల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ల(ఏఆర్‌వో)ను అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో మంగళవారం సెక్టార్, పోలీస్ ఆఫీసర్ల శిక్షణలో మాట్లాడారు. సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను బూత్‌లెవల్ అధికారులు, గ్రామ ప్రత్యేక అధికారులతో కలిసి సందర్శించాలన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు పరిశీలించాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఆయా ప్రాంతాలను పరిశీలించాలన్నారు. అసాంఘిక శక్తులు, నేరచరితులు ఉంటే వారి పూర్తి వివరాలు తీసుకోవాలని కోరారు. పోలింగ్ తక్కువ నమోదైన కేంద్రాల వివరాలు తమ వద్ద ఉండాలని తెలిపారు. ఎన్నికలకు ఒక రోజు ముందు, ఎన్నికల రోజు చేపట్టాల్సిన విధులపై సిరిసిల్ల ఆర్డీవో రమేశ్ సెక్టార్ ఆఫీసర్స్‌కు వివరించారు. పోలింగ్ రోజు ఉదయం నిర్వహించే మాక్ పోలింగ్, పోలింగ్ ముగిసిన అనంతరం చేయాల్సిన పనులపై తెలిపారు. అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా, సీ-విజిల్, సువిధ, ఇతర ఎన్నికల యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ షరీఫ్ మొహినొద్దీన్, సెక్టోరియల్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

- టీపీసీసీ అధికార ప్రతినిధి ఉమేశ్‌రావు



మాట్లాడుతున్న ఉమేశ్‌రావు

సిరిసిల్లటౌన్: దేశంలో బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ పదేళ్లుగా పాలన సాగిస్తుందని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని డీసీసీ ఆఫీసులో మాట్లాడారు. ఎలక్ట్రానిక్ బాండ్ల రూపంలో కోట్లాది రూపాయలను వసూళ్లు చేసి పెద్దెత్తున కుంభకోణానికి తెరతీసిన చరిత్ర బీజేపీదని అన్నారు. ఇండియా కూటమిని ఎదుర్కొనే దమ్ములేకనే కాంగ్రెస్ పార్టీ అకౌంట్లను ఫ్రీజ్ చేయించిందని ఆరోపించారు. దేశంలోని అన్ని స్వతంత్ర వ్యవస్థలను గుప్పిట్లో ఉంచుకుని ప్రతిపక్షాలపై వేధింపులకు పాల్పడుతుందన్నారు. బీజేపీ చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇక ఎంపీ బండి సంజయ్‌ను కరీంనగర్ ప్రజలు ఇప్పటికి మూడుసార్లు ఓడించారని, వచ్చే ఎన్నికల్లో కూడా ఆయన ఓడిపోవడం ఖాయమన్నారు. ఆయనో రిజెక్టెడ్ పీస్ అంటూ వ్యాఖ్యానించారు. మతం పేరుతో జనాలను రెచ్చగొట్టడం తప్ప సంజయ్ ఎంపీగా ఏమాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఇందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా కృషి చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు కూతురు వెంకట్‌రెడ్డి, వెంగల అశోక్, ఎస్కే రియాజ్, రెడ్డిమల్ల భాను, ఎద్మల భూపాల్‌రెడ్డి, వెంకటేశం, మల్లేశ్ బాబు, నాగరాజు, కమలాకర్, శ్రీనివాస్, దత్తు,బ మహిపాల్, మోసిన్, శ్రీనివాస్, వెంకటేశం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా 'షీటీం'



బాలికలకు అవగాహన కల్పిస్తున్న షీటీం సిబ్బంది

ముస్తాబాద్: మహిళలు, యువతులు ఎలాంటి వేధింపులకు గురైనా పోలీసులకు తెలపాలని, షీటీం అండగా ఉంటుందని షీటీం ఏఎస్సై ప్రమీల అన్నారు. ముస్తాబాద్ నవజ్యోతి హైస్కూల్‌లో విద్యార్థునులకు ఈవ్‌టీజింగ్, వేధింపులపై షీటీం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్సై ప్రమీల మాట్లాడుతూ సినిమా హాల్స్, విద్యాసంస్థలు, బస్టాండ్లలో వేధింపులకు పాల్పడితే 100 డయల్ ఫోన్ చేయాలన్నారు. యువతులు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కేజే ప్రకాశ్, ప్రియాంక, రమాదేవి, స్రవంతి, సునీత, లత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

వేసవి భత్యం చెల్లించాలి



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: ఎండాకాలంలో ఉపాధి హామీ కూలీలకు వేసవిభత్యం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్లలోని కార్మిక భవన్‌లో మాట్లాడారు. ఉపాధి కూలీలకు మూడేళ్లుగా కరువు భత్యం చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో లక్షా పదివేల మంది కార్మికులకు వేసవి భత్యం రాకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు. ఉపాధి కూలీలంతా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారని, వారిపై సర్కార్ కరుణ చూపి వెంటనే వేసవి భత్యం బకాయిలు చెల్లించాలని కోరారు. బాచుపల్లి శంకర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

రేపు బార్ అసోసియేషన్ ఎన్నికలు

వేములవాడ: వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 28న ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ప్రచారాన్ని పెంచేశారు. అడ్వకేట్లను వ్యక్తిగతంగా కలుస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఎన్నికల అధికారి విద్యాసాగర్‌రావు ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకుంది.

రాజ్యాంగం జోలికి వస్తే సహించం



నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

గంభీరావుపేట: రాజ్యాంగాన్ని మారుస్తానన్న కేసీఆర్ ప్రభుత్వం పోయిందని, రాజ్యాంగం జోలికి వస్తే సహించేది లేదని, బీజేపీని భూస్థాపితం చేస్తామని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహ కూడలిలో మాల మహానాడు నాయకులు బీజేపీ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను ప్రశంసిస్తుంటే మన నాయకులు రాజ్యాంగాన్ని మారుస్తామనడం మూర్ఖత్వమేనన్నారు. రెడ్డిమల్ల రాజనర్సు, దోసల ఉపేంద్ర, నల్ల రాజ్‌కుమార్, పిట్ల రఘు, లక్కం బాబు, శంకర్, బాలయ్య, సుదర్శన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'టెట్' ఫీజు తగ్గించాలి



మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లటౌన్: పెంచిన టెట్ ఫీజును వెంటనే తగ్గించాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. ఈనెల 27 నుంచి టెట్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుందని, ఈవిషయమై ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని ప్రకటించాలని కోరారు. టెట్ ఫీజు 2021లో రూ.200, 2022లో రూ.300 ఉందన్నారు. ఇప్పుడు ఒక పేపర్‌కు రూ.2వేలు చొప్పున ఫీజు పెంచడం శోచనీయమన్నారు. టెట్ రెండు పేపర్లకు దరఖాస్తు చేసుకుంటే రూ. 4వేలు చెల్లించాల్సి వస్తుందని, ఇది నిరుద్యోగులపై పెనుభారంగా ఉందన్నారు. వెంటనే ఫీజు తగ్గించాలని లేకుంటే ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. నాయకులు శ్రీనివాస్, నవీన్, వంశీ, రాకేశ్, రంజిత్, విజయ్, వెంకటేశ్, నరేశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎంపీ సంతోష్‌కుమార్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాకలో బీపీఎల్ కింద మిడ్‌మానేరు ప్రాజెక్టు ఆర్‌ అండ్‌ఆర్ పరిహారాన్ని అక్రమంగా పొందిన ఎంపీ సంతోష్‌కుమార్, ఆయన సోదరితో పాటు రమణరావుపై, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య మంగళవారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రాజెక్టు కోసం సేకరించిన భూముల్లో కొదురుపాకలో రవీందర్‌రావు భూమి, నివాస గృహాలు సైతం ప్రభుత్వం సేకరించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చారని ఫిర్యాదులో తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు సంతోష్‌కుమార్, అతని సోదరికి, సిరిసిల్ల మండలం పెద్దూర్‌కు చెందిన రమణారావుకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ డబ్బులు ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా డబ్బులు పొందిన వారిపై, అనర్హులకు బీపీఎల్ కింద ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేసి ప్రభుత్వ ధనాన్ని, దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎస్సై పృథ్వీధర్ గౌడ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు విషయంలో సంబంధిత శాఖ అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

ప్రతిమ కన్‌స్ట్రక్షన్స్‌పై చర్యలు తీసుకోవాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మిడ్ మానేరు అదనపు కాలువలు తవ్వేందుకు కాంట్రాక్టు పొంది నిబంధనలు ఉల్లంఘించిన ప్రతిమ కన్‌స్ట్రక్షన్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని మాజీ సీఐ దాసరి భూమయ్య తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాలువ తవ్వేసమయంలో వచ్చిన మట్టిని రాళ్లను డంప్‌చేసేందుకు సదరు కంపెనీవారు ప్రభుత్వం నుంచి భూములు పొందారని కానీ అలా చేయకుండా.. మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లోనే రాళ్లను డంప్‌చేసి నీటి సామర్థ్యం తగ్గేలా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బావి తవ్వకం పనులు నిలిపివేయాలి

ముస్తాబాద్: మండలంలోని మొర్రాపూర్ తండాలోని రేగులకుంట శిఖం భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న బావి తవ్వకం పనులు నిలిపివేయాలని మాజీ సర్పంచ్ దేవేందర్ నాయక్ తహసీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. తండాకు తాగునీరందించే వ్యవసాయ బావి, బోరుబావి వద్ద వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి బావి తవ్వకం చేపట్టారన్నారు. భవిష్యత్‌లో తండా ప్రజలకు నీరందించే పంచాయతీ బావి, బోరు ఎండిపోయే ప్రమాదం ఉందని, శిఖం భూమిలో చేపట్టిన వ్యవసాయ బావి తవ్వకాలను నిలిపివేసి, తండా ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట రాజనర్సు, రాజునాయక్, చంద్రయ్య,నరహరి, బాబు, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా కేసులో మహిళ రిమాండ్

సిరిసిల్లక్రైం: అనుమతి లేకుండా మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ యజమానిని రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి మంగళవారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్‌లోని వెంకటలక్ష్మికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నర్సయ్య ఎలాంటి అనుమతి లేకుండా మానేరు వాగునుంచి ఇసుకను అక్రమంగా తరలించాడు. అంతేకాకుండా ఇసుకను అధికరేట్లకు విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ యజమానిపై కేసునమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రఘుపతి తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ వేంకటేశ్వర్లు

రుద్రంగి: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం రుద్రంగి ఎస్సై అశోక్‌తో పోలీస్‌స్టేషన్‌లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మండల ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల్లో కోడ్ అమల్లో ఉన్నందున పాటించాల్సిన నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు పద్మారావు, బాపురెడ్డి, కానిస్టేబుల్ శ్రీనివాస్, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సబ్‌స్టేషన్ మరమ్మతు పనులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అక్కపల్లి గ్రామ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు రెండోరోజు మంగళవారం సైతం కొనసాగాయి. సోమవారం రాత్రి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్పందించిన సెస్ అధికారులు వెంటనే మరమ్మతు పనులు మొదలుపెట్టారు. ఈక్రమంలో గ్రామంలోని గృహాలకు, వ్యవసాయ మోటార్లకు ఎల్లారెడ్డిపేట్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే అక్కపల్లి గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు మరిన్ని రోజులు కొనసాగే అవకాశం ఉంది.

'ఆరోగ్య మహిళ'కు స్పందన



వైద్యశిబిరంలో పాల్గొన్న మహిళలు

సిరిసిల్లటౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖ చేపట్టిన 'ఆరోగ్య మహిళ' శిబిరానికి విశేష వస్తుందని డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు తెలిపారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీఏసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో ఆరోగ్య మహిళ శిబిరాలు నిర్వహించారు. ముగ్గురిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కంచర్ల రాజు తండ్రి అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన మృతికిగల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు పందిర్ల శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, పద్మారెడ్డి, రమేశ్‌రెడ్డి తదితరులున్నారు.

చల్లంగ చూడు పోచమ్మ తల్లీ



వీర్నపల్లి: డప్పుచప్పుళ్ల మధ్య వెళ్తున్న గ్రామస్తులు

వీర్నపల్లి: మండలకేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలతో శివసత్తుల పూనకాలు, బైండ్లోళ్ల విన్యాసాలు మధ్య భారీ ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి చల్లంగ చూడు తల్లి అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ సంఘం కులపెద్దలు మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని సుద్దాలలో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు తీశారు. గ్రామంలో పెద్దమ్మ బోనాల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం పుట్టకు ధనిపోయుట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని గజసింగవరంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ అధ్యక్షులు, డైరెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేలా డైరెక్టర్లు, అధ్యక్షులు కృషి చేయాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం రైతుల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, రామానుజాగౌడ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

బోయినపల్లి(చొప్పదండి): వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని డీపీవో వీర బుచ్చయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో హరితహారం, శ్మశానవాటిక, డంపింగ్ యార్డు తదితర పల్లె ప్రగతి పనులు పరిశీలించారు. ఎంపీవో ఎ.గంగాతిలక్ తదితరులు ఉన్నారు.

జౌళిశాఖ మంత్రిని కలిసిన పద్మశాలీ ప్రతినిధులు

సిరిసిల్లకల్చరల్: అఖిల భారత పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పట్టణానికి చెందని పలువురు పద్మశాలీ నేతలు మంగళవారం రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. పట్టణంలో నెలకొన్న వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో పాటు స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను మంత్రికి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రకటించినట్లు పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందకట్ల స్వామి, రాష్ట్ర అధ్యక్షుడు కామర్థపు మురళి, మినరల్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్, నాయకులు వెంకటరమణ, సత్యం, దామోదర్ తెలిపారు.

సన్మానం

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దరువు ఎల్లన్నను మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో తన కార్యాలయంలో పూలమాలతో సత్కరించారు. సెస్ డైరెక్టర్ వరస కృష్ణహరి, నాయకులు గుల్లపెల్లి నరసింహారెడ్డి, రాజిరెడ్డి, శంకర్, మధు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ మానేరు వాగునుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గూడెం వద్ద పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించామన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బియ్యం వితరణ

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామానికి చెందిన పొన్నం పర్శ రాములుగౌడ్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. మంగళవారం అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్ మృతుడి కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందజేశారు. ఆయనవెంట గ్రామశాఖ అధ్యక్షుడు పొన్నం మల్లేశం, రాజేశం, రామస్వామి, గంగారెడ్డి, బాలయ్య, నాగేందర్, కిషన్ తదితరులున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కోనరావుపేట: మండలంలోని ఊరుతండా (నిమ్మపల్లి)కి చెందిన ఓ వ్యక్తి మంగళవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. ఊరుతండా గ్రామానికి చెందిన ఇస్లావత్ గంగాధర్‌కు భార్య, ఏడాదిన్నర కూతురు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన గంగాధర్ పురుగులమందు తాగాడు. చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఫిజికల్ సైన్స్ పరీక్ష ప్రశాంతం

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం జిల్లాలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 6,475 మంది విద్యార్థులకు గాను 6470 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రైవేటుగా ఐదుగురు విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా నలుగురు హాజరైనట్లు వివరించారు.

వరిలో ఆకునల్లి నివారణకు చర్యలు తీసుకోవాలి

కోనరావుపేట: వరిచేలలో ప్రస్తుతం వస్తున్న ఆకునల్లి, కంకినల్లి నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకట్రామమ్మ కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిపొలాల్లో అధిక ఉష్ణోగ్రతతో వరిలో కంకినల్లి, ఆకునల్లి ఆశిస్తుందన్నారు. దీని నివారణకు 5 మిల్లీమీటర్లు డైకోఫాల్ లేదా ఒక మిల్లీమీటర్ స్పైరోమెస్పిన్ మందులు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో కంకినల్లితో పాటు వరిలో మెడ విరుపు తెగులు కూడా సోకుతుందన్నారు. దీని నివారణకు పికాక్సిస్ట్రోబిన్ మరియు ట్రైసైక్లోజోల్ 2 మిల్లీమీటర్లు లేదా ట్రైసైక్లోజల్ ఒక మిల్లీమీటర్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న యువకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాల గ్రామానికి చెందిన శ్రీరాములు వెంకవ్వ అనే వృద్ధురాలు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరింది. ఆమె వైద్యఖర్చుల కోసం గ్రామ యువకులు విరాళాలు పోగుచేశారు. రూ.40వేల నగదును వెంకవ్వ కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఆర్థికసాయం చేసిన యువకులకు వెంకవ్వ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మరికొందరు దాతలు ముందుకొచ్చి సాయం అందించాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ గుళ్లపల్లి నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ కదిరే రజిత, నాయకులు చకినాల నారాయణ, ఆంజనేయులు, నిమ్మల బాబు, లక్ష్మారెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా:
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899